
ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY
నల్లగొండ
5
గురువారం 11 ఏప్రిల్ 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.178	270	300
సూర్యాపేట	రూ.170	260	300
నల్లగొండ	రూ.180	260	294

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.0 । కనిష్ఠం 24.4



హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

గెలుపే లక్ష్యం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు ఎంపీ సీట్లపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టిసారించింది. ఈ రెండూ సిట్టింగ్ స్థానాలే కావడంతో ప్రస్తుత ఎన్నికల్లోనూ భారీ మెజార్టీలతో గెలవాలనే లక్ష్యంతో పావులు కదుపుతోంది. నల్లగొండ నుంచి పీసీసీ ప్రధాన కార్యదర్శి కుందూరు రఘువీర్‌రెడ్డిని, భువనగిరి నుంచి పీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని బరిలో దింపిన అధిష్ఠానం సీనియర్ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలపై గెలుపు బాధ్యతలు పెట్టింది. ఈ నేపథ్యంలో రంజాన్ తరువాత నుంచి ప్రచారం ఉధృతం చేయాలని నిర్ణయించింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- రెండు సీట్లూ గెలిచేలా హస్తం ప్రణాళిక
- అభ్యర్థుల నామినేషన్లకు హాజరవనున్న సీఎం
- వచ్చే నెల మొదటి వారంలో ప్రియాంకగాంధీ పర్యటన
- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నివాసంలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గస్థాయి సమావేశం
- హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమానికి సీఎం, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మంత్రులు హాజరు కావాలని నిర్ణయించారు. మే మొదటి వారంలో జిల్లాలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ పర్యటన ఏర్పాటు చేయించి మిర్యాలగూడ (నల్లగొండ లోక్‌సభ), చౌటుప్పల్ (భువనగిరి లోక్‌సభ)లో భారీ బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. నేతల మధ్య భేదాభిప్రాయాల్లేవని, అంతా ఒకటేననే సంకేతాలిచ్చేలా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గస్థాయి ముఖ్యనాయకుల సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవడం ఇందుకు నిదర్శనంగా పార్టీ నేతలు చెబుతున్నారు.

ఎమ్మెల్యే రాజగోపాల్ ఇంటికి వెళ్లిన సీఎం

హైదరాబాద్‌లో బుధవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇంట్లో జరిగిన భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఎంపీ అభ్యర్థులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేలు, వేముల వీరేశం, బీర్ల అయిలయ్య, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, ఇతర ముఖ్యనాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భువనగిరి నియోజకవర్గం ఏర్పాటయ్యాక 2009లో మొదటిసారి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఎంపీగా గెలవగా 2014లో ఆయన ఓడిపోయారు. తిరిగి 2019లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజయం సాధించారు. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు పట్టున్న నియోజవర్గం కావడంతో ఇక్కడ అభ్యర్థి గెలుపు బాధ్యతల్ని రాజగోపాల్‌రెడ్డిపైనే అధిష్ఠానం మోపింది. సీఎం రేవంత్ స్వయంగా రాజగోపాల్‌రెడ్డి ఇంటికి వెళ్లి ఈ విషయాన్ని తేల్చిచెప్పారు. ఎన్నికల ప్రచార బాధ్యతలు రాజగోపాల్‌రెడ్డి నిర్వహిస్తారని, ఆయన నేతృత్వంలో క్యాడర్ పనిచేసి భారీ మెజార్టీతో గెలిపించాలని సీఎం సూచించారు. ప్రతీ నాయకుడు క్షేత్రస్థాయిలో ఉండి ఎన్నికల ప్రచారం నిర్వహించాలని, ఈనెల 21న భువనగిరిలో జరిగే నామినేషన్ కార్యక్రమానికి తాను హాజరవుతానని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి తెలిపారు. అసంతృప్త నాయకులను కలుపుకువెళ్లాలని, అందరికీ న్యాయం జరుగుతుందని ఈ సమావేశంలో కార్యకర్తలకు సీఎం హామీ ఇచ్చారు. సీఎం స్వయంగా రాజగోపాల్‌రెడ్డి ఇంటికి రావడంతో వారిద్దరి మధ్య ఉన్న విభేదాలు సమసిపోయినట్లేననే సంకేతాలు ఇచ్చినట్టయిందని సమావేశంలో పాల్గొన్న నాయకులు పేర్కొంటున్నారు.

ఇక ప్రచార దూకుడు

జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాల్లో రంజాన్ తర్వాత ప్రచార దూకుడు పెంచాలని కాంగ్రెస్ నేతలు నిర్ణయించారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో ఇప్పటికే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించగా, భువనగిరికి సంబంధించి బుధవారం నియోజకవర్గ ఇన్‌చార్జి, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నివాసంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. రంజాన్ తరువాత భువనగిరి లోక్‌సభ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తామని, 21న భువనగిరిలో నామినేషన్ పత్రాలు సమర్పించాలని నిర్ణయించారు. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గపరిధిలోనూ రంజాన్ అనంతరం ప్రచారం దూకుడుగా నిర్వహించాలని నిర్ణయించారు. ఎంపీ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు సహా పార్టీలో వివిధ పదవుల్లో ఉన్న నాయకులు, క్యాడర్ పూర్తిగా నియోజకవర్గాల్లోనే ఉండి పనిచేయాలని, ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఆరు గ్యారెంటీలతో పాటు, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే అమలు చేసే 'పాంచ్ న్యాయ్, పచ్చీస్ గ్యారెంటీస్' మ్యానిఫెస్టోను విస్తృతంగా ఓటర్లలోకి తీసుకెళ్లాలని వివరించారు. పోలింగ్ స్టేషన్ల వారీగా క్యాడర్‌ను అప్రమత్తం చేయాలని, సోషల్‌మీడియాలో విస్తృతంగా ప్రచారం సాగించాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టనున్న పనులు, పథకాలను కూడా వివరించాలని నేతలు నిర్ణయించారు.

బీఆర్ఎస్ లేదు, బీజేపీతోనే నామమాత్రపు పోటీ
- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్ఎస్ లేదని, బీజేపీతోనే కాంగ్రెస్‌కు పోటీ అని, ఆ పార్టీ కూడా ఇక్కడ నామమాత్రమేనని, రెండు లక్షలకు పైగా భారీ మెజార్టీతో చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపిస్తామని బుధవారం హైదరాబాద్‌లో తన నివాసంలో జరిగిన పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్యనాయకుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ సమావేశంలో పలు సూచనలు చేశారని, ఆయన ఆదేశాల మేరకు అభ్యర్థి గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సూచించారు. రంజాన్ తర్వాత నుంచి నియోజకవర్గంలో ప్రచారం వేగవంతం చేస్తామని తెలిపారు. మే మొదటి వారంలో ప్రియాంక గాంధీని జిల్లా పర్యటనకు తీసుకువస్తామని చెప్పారు.



లోక్‌సభ పోరుకు సీపీఎం సై

- ఉద్యమాల గడ్డ భువనగిరిపైనే గురి
- కేంద్ర, రాష్ట్ర నాయకత్వం పర్యవేక్షణ
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జీల నియమాకం
- పోరాట స్ఫూర్తితో ప్రచారం

యాదాద్రి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): భువనగిరి నియోజకవర్గంలో భూమి, భుక్తి కోసం జరిగిన పోరాటాల్లో కమ్యూనిస్టులది కీలక పాత్ర. తెలంగాణలో మొట్టమొదటిసారి ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులు(పీడీఎఫ్)తరఫున పోటీచేసి, మెజార్టీ నియోజకవర్గాల్లో ఎర్రజెండాను రెపరెపలాడించారు. గతంలో నల్లగొండ, మిర్యాలగూడ పార్లమెంట్ స్థానాలకు కమ్యూనిస్టు నేతలు ప్రాతినిధ్యం వహించారు. ఆ తరువాత మారిన రాజకీయ పరిణామాలతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వామపక్షాల బలం తగ్గుతూ వచ్చింది. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల వేళ మరోసారి పోరుగడ్డపై ఎర్రజెండాను ఎగురవేయాలన్న ఉత్సాహంతో సీపీఎం ఎన్నికల కదన రంగంలో నిలిచింది. గత ఉద్యమస్ఫూర్తిని ప్రజల్లో రగిలించి మెజార్టీ ఓట్లు సాధించేందుకు యత్నిస్తోంది. ఒక్క భువనగిరి నుంచే సీపీఎం ప్రస్తుతం పోరులో ఉండగా, కేంద్ర, రాష్ట్ర నాయకత్వం ఈ నియోజకవర్గంపై దృష్టిసారించింది.

లోక్‌సభ ఎన్నికల్లో వామపక్ష పార్టీలైన సీపీఎం, సీపీఐతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంటుందని భావించారు. అయితే సీపీఐ మాత్రమే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో ఏదైనా ఒక స్థానం నుంచి పోటీకి అవకాశం కల్పించాలని కాంగ్రెస్‌ను సీపీఐ కోరినా, రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సీటు కేటాయించలేదు. అయినా కాంగ్రెస్‌కు సీపీఐ మద్దతు ప్రకటించింది. సీపీఎం మాత్రం అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే ఒంటరి పోరాటానికి సిద్ధమైంది. రాష్ట్రంలో మొత్తం 17లోక్‌సభ స్థానాలు ఉండగా, ఒక్క భువనగిరి నియోజకవర్గం నుంచి అభ్యర్థిని దింపింది. ఈ మేరకు ప్రచారాన్ని కూడా ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సీపీఎంకు కొంత మేర ఓటర్లు ఉన్నారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గతంలో ఒంటరిగా, ఆ తరువాత టీడీపీ మిత్రపక్షంతో ఎమ్మెల్యేలుగా గెలిచారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఇబ్రహీంపట్నం, తుంగతుర్తి, జనగామ, నకిరేకల్‌లో పలు మార్లు సీపీఎం అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా గెలిచారు. మునుగోడులో సీపీఎం మద్దతుతో సీపీఐ గెలుపొందింది. భువనగిరి, ఆలేరులో గతంలో పీడీఎఫ్ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ నేపథ్యంలో పోరాటాల గడ్డ నుంచి సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్‌ను అభ్యర్థిగా ప్రకటించి, ప్రచారంలోకి దిగింది. మిగతా 16 నియోజకవర్గాల్లో ఎవరికి మద్దతు ఇవ్వాలనే అంశంపై కేంద్ర నాయకత్వం ఆలోచిస్తోంది. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లోనూ పార్టీ సన్నాహక సమావేశాలు నిర్వహించింది.

సీపీఐ మద్దతు తెలిపేనా?

భువనగిరి నియోజకవర్గంలో సీపీఐకి పలు ప్రాంతాల్లో బలమైన ఓట్లు ఉన్నాయి. అయితే సీపీఐ అధిష్ఠానం లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించింది. భువనగిరి లోక్‌సభ స్థానం నుంచి సీపీఎం బరిలో దిగింది. ఈ నేపథ్యంలో సీపీఎంకు సీపీఐ మద్దతు ప్రకటిస్తుందా? లేక కాంగ్రెస్‌కే మద్దతు పలుకుతుందా? అనేది నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికలకు ఓటర్లలో చాలా మార్పులు ఉంటాయి. ఈ నేపథ్యంలో వామపక్ష భావాజాలం ఉన్న నేతలు సీపీఎంకు మద్దతు ప్రకటించే అవకాశం ఉంది.

నియోజకవర్గాలకు ఇన్‌చార్జీల నియమాకం

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జీగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములును పార్టీ నియమించింది. అదేవిధంగా పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులను ఇన్‌చార్జీలుగా నియమించింది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో ఉన్న సీనియర్ నేతలను కన్వీనర్, కోకన్వీనర్‌లుగా ప్రకటించింది. భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీగా పాలడుగు భాస్కర్, ఆలేరు నియోజకర్గానికి టి.సాగర్, నకిరేకల్‌కు జి.నాగయ్య, తుంగతుర్తికి మల్లు లక్ష్మి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి జాన్‌వెస్లీ, జనగామ నియోజకవర్గానికి ఎండీ.అబ్బాస్, మునుగోడు నియోజకవర్గానికి జూలకంటి రంగారెడ్డిని నియమించింది. వీరంతా లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యే వరకు నియోజకవర్గాల్లో పర్యటిస్తూ, గతంలో సీపీఎం ప్రజాప్రతినిధులుగా ప్రాతినిధ్యం వహించిన వారిని కలుస్తూ, పార్టీ బలోపేతంతోపాటు అభ్యర్థికి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించనున్నారు. ప్రస్తుతానికి అన్ని నియోజకవర్గాల్లో అంతర్గతంగా పార్టీ తీసుకున్న నిర్ణయాలపై సమావేశాలు పూర్తయ్యాయి. నామినేషన్ అనంతరం కేంద్ర పార్టీ నేతలతో బహిరంగ సభలు నిర్వహించనున్నారు.

నేడు ఈదుల్ ఫితర్

సామూహిక ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గాలు



నల్లగొండ కల్చరల్, ఏప్రిల్ 10: రంజాన్ పండుగను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముస్లింలు గురువారం నిర్వహించనున్నారు. బుధవారం సాయంత్రం 30 రోజుల ఉపవాస దీక్షను ఇఫ్తార్‌తో విరమించారు. సాయంత్రం నెలవంక కనిపించటంతో ఈదుల్ ఫితర్ రంజాన్ పండుగకు ముస్లింలు సన్నద్ధమయ్యారు. నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు, తరావీ నమాజులు, ఖురాన్ పఠనంతో అల్లాను స్మరించుకున్న ముస్లింలు పండుగ పనుల్లో నిమగ్నమయ్యారు. నల్లగొండ జిల్లా కేంద్రం మునుగోడు రోడ్‌లోని ఈద్గాలో ముస్లింల సామూహిక ప్రార్థనలకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. షామియానాలు ఏర్పాటుచేశారు. ప్రార్థనలకు పెద్ద సంఖ్యలో ముస్లింలు హాజరుకానుండటంతో పోలీస్‌శాఖ కట్టుదిట్ట భద్రత ఏర్పాటు చేయనుంది. అదేవిధంగా పలు మసీదుల్లో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పండుగ సందర్భంగా పట్టణంలోని పలు వస్త్ర, నిత్యావసరాల సరుకుల దుకాణాలు సందడిగా మారాయి. పట్టణంలోని ప్రకాశంబజార్ కిటకిటలాడింది. ఈద్గాల వద్ద ఏర్పాట్లను మునిసిపల్, పోలీసు అధికారులు, ఈద్గా కమిటీ సభ్యులు బుధవారం సాయంత్రం పరిశీలించారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు



రంజాన్ మాసంలో 30 రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో పండుగ నిర్వహించాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బుధవారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు. రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతీ ముస్లిం ఘనంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

- మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

పోలింగ్ సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు చేయాలి

కలెక్టర్ దాసరి హరిచందన



పోలింగ్ ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్

మిర్యాలగూడ, ఏప్రిల్ 10: పోలింగ్ సిబ్బందికి తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం, రిసెప్షన్ కేంద్రాలను బుధవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాల్లో అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్‌రూంల వద్ద ఏర్పాటు చేయాల్సిన సీసీ కెమెరాలు భద్రత ఏర్పాట్లు తదితర అంశాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆయా కేంద్రాల ఏర్పాటులో అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సమస్యలుంటే పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, తహసీల్దార్ హరిబాబు తదితరులున్నారు.



కిలో..@300

- కొండెక్కిన చికెన్ ధరలు
- కార్పొరేట్ కంపెనీల మాయాజాలం
- ఉత్పత్తి తగ్గడం, పెళ్లిళ్లు, ఎన్నికల సీజన్ కావడమే కారణం

చికెన్ రేట్లు రోజు రోజుకు పెరుగుతున్నాయి.మాంసం రేటు ఎక్కువగా ఉండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇంటికి బంధువులొచ్చినా, పండగలొచ్చినా చికెన్‌తోనే సరిపెట్టుకుంటారు. కొంతమంది వారానికో సారి చికెన్ తెచ్చుకుంటుడగా, మరి కొందరు 15, 20 రోజులకో సారి తెచ్చుకుంటారు. చికెన్ కిలో రూ.300 చేరడంతో ఆ మాత్రం కూడా అందుబాటులో లేకుండా పోయింది.

- మోత్కూరు

రైతుల వద్ద కోళ్లు ఉన్నప్పుడు కార్పొరేట్ సంస్థలు రేటు తగ్గించడం, రైతుల వద్ద కోళ్లు లేనప్పుడు కార్పొరేట్ సంస్థలు రేటు పెంచడం మామూలైంది. ఇప్పుడు రాష్ట్రంలోనూ. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనూ కోళ్ల ఉత్పత్తి (పెంపకం) తగ్గింది. రైతుల వద్ద కోళ్లులేవు.పైగా మహారాష్ట్రలో కోళ్ల కొరత ఏర్పడి చికెన్‌కు బాగాడిమాండ్ ఉంది. తెలంగాణ కన్నా మహారాష్ట్రలో రేటు ఎక్కువగా ఉండటంతో కోళ్లను అక్కడికి ఎగుమతి చేస్తున్నారంటున్నారు. దీంతో కార్పొరేట్ కంపెనీలు కోళ్ల ధరను బాగా పెంచారు. దీంతో ఇక్కడ రోజురోజుకూ చికెన్ ధర పెరుగుతోంది.

జనవరిలో నష్టాలతో కోళ్లు పెంచని రైతులు

జనవరి, ఫిబ్రవరి మొదటి వారంలో కోళ్ల (ఫాం) రేటు రూ.70 నుంచి రూ.80 మాత్రమే ఉంది. ఈ రేటు రైతుకు గిట్టుబాటు కాదు. ఈ రేటుకు విక్రయిస్తే ఒక్కో కోడిపై రూ.50 నుంచి రూ.60 నష్టం వస్తుంది. 5వేల కోళ్లు పెంచే రైతుకు రూ.2.50లక్షల నుంచి రూ.3 లక్షలు నష్టం వస్తుందని చెబుతున్నారు. రేటు పెరగకుంటే నష్టం వస్తుందని, వేసవిలో కోళ్లు సరిగా ఎదగవని, ఎండ తీవ్రతకు తట్టుకోలేక చనిపోతాయన్న భయంతో రైతులు కోళ్లు పెంచలేదు. కార్పొరేట్ సంస్థలు మాత్రమే కోళ్లు పెంచాయి. వేసవికావడంతో కోళ్లు అనుకుంత ఎదగలేదు. దీంతో కోళ్ల కొరత ఏర్పడింది. పైగా పెళ్లిళ్లు, ఉగాది, రంజాన్ పండుగల సీజన్, పార్లమెంటు ఎన్నికలు కూడా రావడంతో చికెన్‌కు బాగా డిమాండ్ పెరిగింది. ఇదిలా ఉంటే పట్టణాలు, మండల కేంద్రాల్లోనే రూ.270 ధర ఉంది. గ్రామాల్లో ఇంకో పది రూపాయలు ఎక్కువే విక్రయిస్తున్నారు. ముఖ్యందు ధర ఇంకా పెరగవచ్చని చికెన్ దుకాణాదారులు చెబుతున్నారు.

ధర పెరిగి చికెన్ కొనలేక పోతున్నాం



మాంసం ధర ఎక్కువగా ఉండటంతో పదిహేను రోజులో ఒకసారి చికెన్ తెచ్చుకునే వారం. ఇప్పుడు చికెన్ ధర కూడా మండిపోతున్నది. చికెన్ ధర కిలో రూ.300 కావడంతో చికెన్ కొనలేక పోతున్నాం. నెల రోజులుగా చికెనే తెచ్చుకోలేదు.

- పూసపల్లి వెంకన్న, కొత్తగూడెం



ధర పెరుగుదలతో కొనలేక పోతున్న ప్రజలు

గ్రామీణ ప్రాంతాల్లో సామాన్య జనం రోజు విడిచి రోజో, వారానికోసారో తినరు. ఇంటికి బంధువులు వచ్చినప్పుడో, ఏదైనా కార్యం జరిగినప్పుడో మటన్‌గాని,చికెన్‌గాని తెచ్చుకుంటారు. గ్రామాల్లో యాటలు కోసే వారు లేక మటన్ ఎక్కువగా దొరకదు. అప్పుడో, ఇప్పుడో దొరికినా కిలో రూ.800 నుంచి రూ.850 అమ్ముతారు. కోసింది మంచిదో, రోగమొచ్చిందో తెలియ దు. చికెన్‌ధర తక్కువగా ఉంటుందని,గ్రామాల్లోని సామాన్య ప్రజలు మాంసం కొనలేక చికెన్‌తోనే సరిపెట్టుకుంటారు. ఇప్పుడు ధరలు బాగా పెరగడంతో చికెన్ కూడా తెచ్చుకోలేక పోతున్నామని ఆవేదన చెందుతున్నారు.

ఈ నెలలో చికెన్ ధరలు

తేది	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
3న	226	246
4న	230	260
5న	240	270
6న	260	290
8న	270	300
9న	270	300
10న	270	300

సిజేరియన్లకు ప్రాధాన్యమిస్తే చర్యలు

డీఎంహెచ్‌వో కొండల్‌రావు



మానస ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కొండల్‌రావు

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 10: గైనిక్ డాక్టర్లు సిజేరియన్లకు ప్రాధాన్యమిచ్చి కాన్పులు జరిపితే శాఖాపరమైన చర్యలు ఉంటాయని డీఎంహెచ్‌వో కొండల్‌రావు హెచ్చరించారు. పట్టణంలోని డాక్టర్స్‌కాలనీలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో బుధవారం ఆకస్మిక తనిఖీలు జరిపి ప్రసవాల నమోదు రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో కొందరు గైనిక్ వైద్యులు అనవసరంగా ఆపరేషన్లు చేసి ప్రసవాలు జరుపుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించగా మానస, శిరీష, రమా ఆస్పత్రుల్లో నార్మల్ డెలివరీల సంఖ్యకంటే ఆపరేషన్లు ఎక్కువగా జరిగినట్లు గుర్తించి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. కొందరు వైద్యులు తమ స్వప్రయోజనంకోసం ఆపరేషన్లు నిర్వహించి నార్మల్ డెలివరీల సంఖ్యను తగ్గిస్తున్నట్లుగా సమాచారం ఉందన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకునేందుకు తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న ఆస్పత్రులకు చెందిన వైద్యుల నుంచి సిజేరియన్లు చేయడానికి గల కారణాలపై వివరణ కోరినట్లు తెలిపారు. అదేవిధంగా పట్టణంలో కొనసాగుతున్న ఎనిమిది హోమియోపతి ఆస్పత్రులు వైద్యారోగ్యశాఖ నిబంధనల మేరకు అనుమతులు పొందాల్సి ఉందన్నారు. రిజిస్ట్రేషన్ పొందకుండా ఆస్పత్రులు నడుపుతున్న యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి అనుమతులు తీసుకునేందుకు గడువు విధించినట్లు తెలిపారు. నిర్ణీత వ్యవధిలోపు రిజిస్ట్రేషన్ చేయించకుంటే సీజ్‌చేస్తామని హెచ్చరించారు. ఆయనవెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో రవి, సీహెచ్‌వో వెంకయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

14న సాహిత్య సమాలోచన సదస్సు

నల్లగొండ కల్చరల్, ఏప్రిల్ 10: ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి సాహిత్య సమాలోచన సదస్సు ఈ నెల 14న ఎన్జీ కళాశాలలో జరుగుతుందని కళాశాల తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణ కౌండిన్య తెలిపారు. సృజన సాహితీ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఏనుగు నర్సింహారెడ్డి మూడు దశాబ్దాలుగా పైగా తెలుగు సాహిత్యంలో చేస్తున్న కృషిని ఈ సదస్సు ప్రతిబింబిస్తుందన్నారు. సదస్సులో కవులు, సాహితీవేత్తలు, పరిశోధకులు, సాహిత్య విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సృజన సాహితీ సంస్థ అధ్యక్షుడు పెరుమాళ్ల ఆనంద్, సాహితీవేత్తలు మాదగాని శంకరయ్యగౌడ్, సాగర్ల సత్తయ్య, లింగమూర్తి, జ్ఞానేశ్వర్, దేవాదానం, రవికుమార్, సైదులు పాల్గొన్నారు.

వాగ్దేవి అలంకరణలో
ఎల్లమ్మ తల్లి

కనగల్, ఏప్రిల్ 10: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ అమ్మవారు బుధవారం భక్తులకు వాగ్దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. బోనం నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.



23వ జైన తీర్థంకరుడు పార్శ్వనాథుడి విగ్రహం లభ్యం

రాజాపేట, ఏప్రిల్ 10: యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం నెమిల గ్రామంలో జైనమత తీర్థంకరుడు పార్శ్వనాథుడి విగ్రహాన్ని గుర్తించినట్లు కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ రామోజు హరగోపాల్, బృందం సభ్యుడు కుండె గణేష్ తెలిపారు. బుధవారం నెమిల గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నెమిల గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద అసంపూర్తిగా ఉన్న విగ్రహం గుర్తించి స్థానికులు సమాచారం ఇచ్చారని ఆయన తెలిపారు. ఆ మేరకు విగ్రహాన్ని పరిశీలించామని జైన ధర్మానికి చెందిన 23వ తీర్థంకరుడి విగ్రహంగా గుర్తించామని, 22వ జైన తీర్థంకరుడైన నేమినాథుడి పేరుమీదనే నెమిల గ్రామం వెలిసిందని ఆయన వివరించారు.

ఈ ప్రాంతమంతా జైన వసతులతో అలరాడేదని, కొలనుపాక, రఘునాథపురం, సైదాపురం కొల్లూరు గ్రామాల్లో లభించిన శిల్పాలే ఇందుకు సాక్ష్యమన్నారు. నెమిలలో గుర్తించిన శిల్పం పార్శ్వనాథుడి వెనుక భాగాన చుట్టలు తిరిగిన 7 తలల సర్పం ఉన్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయని, దాని ఆధారంగా పార్శ్వనాథుడిగా గుర్తించామన్నారు. రాష్ట్ర కూట శైలిలో చెక్కబడిందని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మల్లేష్(ఫైల్)

సూర్యాపేటరూరల్, ఏప్రిల్ 10: ట్రాక్టర్, బైక్‌ను ఢీకొనడంతో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా సూర్యాపేట మునిసిపల్ పరిధిలోని పిల్లలమర్రి రోడ్డులో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లలమర్రి గ్రామానికి ఇరుగు మల్లేష్(23) బ్యాండ్ మేళం, గ్రామంలో కూలి చేసుకుంటూ జీవనసాగిస్తున్నాడు. పని నిమిత్తం సూర్యాపేట వెళ్లి పిల్లలమర్రి గ్రామానికి వెళ్తున్న క్రమంలో పిల్లలమర్రి నుంచి సూర్యాపేటకు వస్తున్న ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. మల్లేష్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మల్లేష్‌కు భార్య కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు కాలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 10: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు నుంచి నార్కట్‌పల్లి వైపుకు ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 10: తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణం హౌసింగ్‌బోర్డుకాలనీలో బుధవారం వెలుగులోకి వచ్చింది. కాలనీకి చెందిన మోర చంద్రశేఖర్ ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి ఉగాది పండుగ కోసం మంగళవారం తిప్పర్తి మండలం పజ్జూరు గ్రామానికి వెళ్లాడు. తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తించిన దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి సెల్ఫులో దుస్తుల కిందదాచిన రూ.50వేలను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. బుధవారం ఊరినుంచి ఇంటికి తిరిగి వచ్చేసరికి తాళం పగులగొట్టి వస్తువులను చిందరవందరగా పడవేసి ఉండడాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. వన్‌టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనునాయక్ తెలిపారు.

బంగారు నగల దుకాణంలో..





నగల దుకాణంలో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

గరిడేపల్లి: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెంలో మంగళవారం రాత్రి బంగారు నగల దుకాణంలో చోరీ జరిగింది. ఎస్‌ఐ. ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బంగారు రాజేష్ కీతవారిగూడెంలో బంగారు నగల దుకాణం నడుపుతున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి దుకాణానికి తాళం వేసి తన ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం దుకాణం వద్దకు వచ్చి చూడగా దుకాణం చిన్న షట్టర్ తాళం పగలగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. దీంతో పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్‌ఐ, హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు కూడా సంఘటనా స్థలానికి చేరుకొని దుకాణాన్ని పరిశీలించి వెంటనే క్లూస్ టీంను రప్పించారు. దొంగలు దుకాణంలో ఉన్న సీసీ టీవీ కెమెరాలను ధ్వంసం చేసి చోరీకి పాల్పడినట్లు తెలిపారు. కౌంటర్‌లో ఉన్న రూ.40వేలు, నాలుగు జతల బంగారం మాటీలు, కొంత వెండి వీటి మొత్తం విలువ సుమారు రూ.2లక్షల 60 వేలు ఉంటుందని, రాజేష్ ఫిర్యాదు మేరకు కే సు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ. సైదులు తెలిపారు.

చిన్నసూరారంలో బైక్

తిప్పర్తి, ఏప్రిల్ 10: ఇంట్లో ఉన్న బైక్ చోరీకి గురైంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని చిన్న సూరారం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని గ్రామానికి చెందిన నారగోని శివశంకర్ ఏప్రిల్ 2వ తేదీ రాత్రి తనఇంటి ఎదుట రోజు మాదిరిగానే బైక్ ఉంచి నిద్రించాడు. మరుసటి రోజు ఉదయం లేచి చూసే సరికి బైక్ కనబడలేదు. చుట్టు పక్కల తెలిసిన వారికి కబురు చేసి వెతికినా దొరకలేదు. బాధితుడు బుధవారం తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి. రాజు తెలిపారు.

పొంగిపొర్లుతున్న నిర్లక్ష్యం

- పానగల్లు జంక్షన్‌లో అస్తవ్యస్థంగా సర్వీస్ రోడ్డు
- ఫ్లైఓవర్ పనులతో దెబ్బతిన్న పైప్‌లైన్లు
- దెబ్బతిన్న యూజీడీ పనులు
- రోడ్డుపైనే పారుతున్న మురుగు నీరు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- నేషనల్ హైవే నిర్మాణ సంస్థ నిర్వాకం





పానగల్ జంక్షన్ ఫ్లైఓవర్ వద్ద రోడ్డుపైన పొంగి పొర్లుతున్న మురుగు నీరు

నల్లగొండ, ఏప్రిల్ 10: జిల్లాకేంద్రంలోని నార్కట్‌పల్లి-అద్దంకి బైపాస్ రోడ్డులో పానగల్లు జంక్షన్ వద్ద డ్రైనేజీ మురుగు నీరు పొంగి పొర్లుతోంది. నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్‌ను ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డులో ఈ మురుగు నీరు రోడ్లపైనే పారుతోంది. డ్రైనేజీ నీరు పారుతున్నా మునిసిపల్ అధికారులు చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. డ్రైనేజీ మ్యానువల్స్ నుంచి నీరు లీకవుతూ రోడ్లపైకి పారుతున్నాయి. దీనికి తోడు సర్వీస్ రోడ్డు అస్తవ్యస్థంగా ఉండడంతో రోడ్డుపై గుంటల్లో మురుగునీరు అంతా నిల్వ ఉండి అస్తవ్యస్థంగా తయారైంది. డ్రైనేజీ మ్యానువల్స్‌లో చెత్త, చెదారం పేరుక పోవడంతో డ్రైనేజీలోని మ్యా నువల్స్ నుంచి మురుగు నీరు అంతా పొంగి పొర్లుతోంది. స్థానిక ప్రజా ప్రతినిధులతో పాటు మునిసిపల్ అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కొద్ది రోజుల క్రితం పానగల్లు లోని ప్రభుత్వ పీహెచ్‌సీ ఎదురుగా కూడా మురుగు నీరు పారడంతో ఇబ్బందులు తలెత్తాయి. ఆ మురుగు నీరు సమీపంలోనే చేపల విక్రయాలు జరిగాయి. కొద్ది రోజులుగా డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైనా మునిసిపల్ అధికారులు స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని పేర్కొంటున్నారు. మురుగు నీటి నిల్వల్లో దోమల వల్ల ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదముంది.

నేషనల్ హైవే నిర్మాణ సంస్థ నిర్వాకంతో..

నార్కట్‌పల్లి, అద్దంకి రహదారిపై ఫ్లైఓవర్ నిర్మించిన నేషనల్ హైవే నిర్మాణ సంస్థతో పాటు హైవే అధికారుల నిర్వాకంతో సర్వీస్ రోడ్డు వెంట యూజీడీ పనులు దెబ్బతిన్నట్లు మునిసిపల్ అధికారులు పేర్కొంటున్నారు. యూజీడీ పనులు దెబ్బతిన్నందున పనులు వెంటనే చేపట్టాలని వారికి నల్లగొండ మునిసిపల్ అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. అయినప్పటికీ ఇంతవరకు ఆ నిర్మాణ సంస్థ స్పందించలేదు. ఆ పను లు పూర్తి చేయడానికి రూ.5 కోట్ల వరకు ఖర్చు అవుతుందని సమాచారం. నిర్మాణం ఖర్చు నేషనల్ హైవే నిర్మాణ సంస్థ భరించాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో పనులు జరిగే పరిస్థితి లేదు. ఫ్లైఓవర్ పనులు పూర్తిచేసుకుని బిల్లులు తీసుకున్న సదరు నిర్మాణ సంస్థ సర్వీస్ రోడ్డు విషయంతో పాటు యూజీడీ పనులు చేపట్టాలన్న ఆలోచన మర్చిపోవడం గమనార్హం. ఎన్నికల కోడ్‌తో పనులు ఆగినట్లు మునిసిపల్ అధికారులు భావిస్తున్నా అవి గతంలో చేపట్టిన పనులే అయినందున ఎన్నికల కోడ్‌కు సంబంధం లేదని సమాచారం. కావాలనే నేషనల్ హైవే నిర్మాణ సంస్థ నిర్లక్ష్యం చేస్తుందని పట్టిం చుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. దీనికి తోడు నల్లగొండ మునిపిసల్ అధికారులు కూడా అలసత్వ వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

నేషనల్ హైవే అధికారులదే బాధ్యత



ఫ్లై ఓవర్ నిర్మించే క్రమంలో పైప్ లైన్లు ధ్వంసమయ్యాయి. ఈ పైప్ లైన్ నిర్మాణానికి నేషనల్ హైవే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. వాటిని వారే సరిచేయాల్సి ఉంది. నేషనల్ హైవే అథారిటీ వారికి లెటర్ రాశాం. ఆ పైప్‌లైన్ పునర్నిర్మాణం చేయాలంటే సుమారుగా ఐదు కోట్ల పైనే ఖర్చు అవుతుంది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ఉన్నందున పనులు ప్రారంభం కావడం లేదు. కోడ్ ముగిసిన తర్వాత ప్రారంభిస్తుండొచ్చు.

\- సయ్యద్ ముసబ్ అహ్మద్,
నల్లగొండ మునిసిపల్ కమిషనర్.



యాదగిరీశుడికి వైభవంగా నిత్య పూజలు



యాదగిరీశుడి నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఆర్కిటెక్ ఆనందసాయితో చర్చిస్తున్న ఈవో భాస్కర్‌రావు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 10: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య కైంకర్యాలు వైభవంగా కొనసాగాయి. ప్రభాతవేళ సుప్రభాతంతో స్వామి, అమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులు, సువర్ణ ప్రతిష్ఠా అలంకారమూర్తులను వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ అభిషేకించి తులసీదళాలతో సహస్రనామార్చన చేశారు. ప్రధానాలయ అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను ముగ్ధమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణపర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహిం చారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన అర్చకులు అలంకార వెండి జోడుసేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్యకైంకర్యాలు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా జరిగాయి. అదేవిధంగా కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.27,43,764 ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు. కొండపైన ఆలయాలు, దుకాణాలు, ప్రసాద విక్రయశాలను ఈవో భాస్కర్‌రావు పరిశీలించారు. ముందుగా ప్రధానాలయం, శివాలయం నుంచి ప్రసాద విక్రయశాలలో పర్యటించి పులిహోర, లడ్డూల నాణ్యత, పరిశుభ్రత, ప్యాకింగ్‌లపై ఆరా తీశారు.

డిజిటల్ స్ర్కీన్ , సంగీత భవన ఏర్పాటుకు స్థల పరిశీలన

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో డిజిటల్ స్ర్కీన్ ఏర్పాటుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఆలయం ఆగ్నేయం దిశలో బ్రహ్మోత్సవ మండపం వద్ద ఏర్పాట్లు చేయనున్నారు. ఈ మేరకు ఆర్కిటెక్ట్ ఆనందసాయి బుధవారం యాదగిరికొండపై ఈవో ఏ.భాస్కర్‌రావుతో కలిసి స్థల పరిశీలన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో ఉండే ప్రదేశంలో స్ర్కీన్‌ను ఏర్పాటు చేసేందుకు చర్చించారు. అదేవిధంగా శుక్ర, శని, ఆది వారాల్లో భక్తులు సంగీత, సాహిత్య సభలు తిలకించేందుకు సంగీత భవనం నిర్మించేందుకు స్థల పరిశీలించారు. ప్రస్తుతం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేం దుకు తాత్కాలికంగా ఏర్పాటు చేసేందుకు కూడా స్థల పరిశీలించారు. దీంతో పాటు కొండపైన బస్టాండ్ హెల్ప్‌డెస్క్ 10రోజుల్లో ప్రారంభకానుండగా రూ.150 ప్రత్యేక దర్శనం భక్తుల కోసం కొత్తగా క్యూలైన్ రూపొందించేందుకు చర్చించారు. ఈ కార్యక్రమంలో డీఈవో దోర్బల భాస్కరశర్మ, సివిల్ ఈఈ దయాకర్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఈఈ ఊడెపు వెంకటరామరావు, సివిల్ డీఈ మహిపాల్‌రెడ్డి, ఏఈ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

భువనగిరి అర్బన్, నల్లగొండ రూరల్, ఏప్రిల్ 10: తాగునీటి ఎద్దడి నివారణకు రకాల చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాలో అప్రమత్తంగా ఉండాలని, సమస్యలు ఉత్పన్నమైతే పరిష్కరించాలన్నారు. జిల్లాల్లో తాగునీటి సరఫరాకు సంబంధించి ప్రత్యేకంగా కంట్రోల్ రూంను ఏర్పాటు చేయాలన్నారు. నీటి సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన బృందాలను నియమించాలని, నీటి సరఫరాలో క్షేత్రస్థాయి నుంచి రెగ్యూలర్ ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి సీఎంఆర్ రైస్ డెలివరీ వేగవంతం చేయాల్సి అవసరముందని, భారత ఆహార సంస్థ నిర్దేశించిన సమయానికి బియ్యం అందజేసే విధంగా మిల్లుల పనితీరును పర్యవేక్షించాలన్నారు. యాసంగి ధాన్యం కొనుగోలు అంశాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే త్వరతగతిన రైతులకు చెల్లింపులు అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక సదుపాయాల కల్పన పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. తాగునీటి సౌకర్యం, నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. అదనపు మరుగుదొడ్లు, తరగతి గదుల మరమ్మత్తులు, విద్యుత్ సౌకర్యం వంటి పనులు వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జెండగే, అదనపు కలెక్టర్లు బెన్‌షాలోమ్, గంగాధర్, నల్లగొండలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నార్కట్‌పల్లి మండల కాంగ్రెస్ నేతలు



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న పిల్లలమర్రి శ్రీనివాస్

నార్కట్‌పల్లి, నల్లగొండ, తిరుమలగిరి, చండూరు, కట్టంగూరు, భువనగిరి రూరల్, మోత్కూరు, ఏప్రిల్ 10: హైదరాబాద్‌లో బుధవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఇంట్లో భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరై దిశానిర్దేశనం చేశారు. సమావేశం అనం తరం పలువురు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయ కులు సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలానికి చెందిన మాజీ జడ్పీటీసీ అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి, చెర్వుగట్టు మాజీ సర్పంచ్ నేతకాని కృష్ణయ్య, గడుసు శశిధర్‌రెడ్డి, వారాల రమేష్ ఉన్నారు. చేనేత సహకార సంఘాలకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం రూ.35కోట్ల రుణమాఫీ చేసి తక్షణమే చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని డీసీసీబీ మాజీ డైరెక్టర్ నేలపట్ల చేనేత సహకార సంఘం అధ్యక్షుడు పిల్లలమర్రి శ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కోరారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలను నిర్వీర్యం చేసిందని అన్నారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు, వైస్ చైర్‌పర్సన్ కేశిడి సరళ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వై. నరేష్, సుంకరి జనార్ధన్, కౌన్సిలర్లు సీఎంను కలిశారు. అదేవిధంగా చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఎంపీపీ తాడూరు వెంకట్‌రెడ్డి, జడ్పీటీసీ చిల్కూరి ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చెన్నగోని అంజయ్యగౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెల్ల రాజశేఖర్‌రెడ్డి, బి.మురళి, పబ్బు రాజు, మోత్కూరు మండలం బుజిలాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చింతల ఉపేందర్‌రెడ్డి, భువనగిరి మండలం చందుపట్ల పీఏసీఎస్ చైర్మన్ మండడి లక్ష్మీనర్సింహారెడ్డి, పీఏసీఎస్ మాజీ వైస్‌చైర్మన్ నానం కృష్ణగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలిమినేటి కృష్ణారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు. రాష్ట్రంలో బడ్జెట్ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ట్రస్మా నల్లగొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు సీఎం రేవంత్‌రెడ్డి వినతిప త్రం అందజేశారు. చండూరు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. పట్టణాభివృద్ధిపై వినతిపత్రం అందజేశారు. కార్య క్రమంలో మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ దోటి సుజాత వెంకటేశ్‌యాదవ్, నాయకులు అనంత చంద్రశేఖర్‌గౌడ్, కొరిమి ఓంకారం, డాక్టర్ కోడి శ్రీనివాసులు, నల్లగంటి మల్లేష్, పల్లె వెంకన్న, కలిమికొండ జనార్ధన్, గంట సత్యం తదితరులు ఉన్నారు.

రూ.5.70 లక్షల నగదు పట్టివేత



నార్కట్‌పల్లిలో నగదు స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

చిట్యాల రూరల్, కోదాడ రూరల్, నార్కట్‌పల్లి, ఏప్రిల్ 10: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వాహనాల తనిఖీలు కొనసాగుతున్నాయి. తనిఖీల్లో భాగంగా చిట్యాలలోని జాతీయ రహదారి వట్టిమర్తి స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా సరైన ఆధారాలు లేకుండా ఓ వ్యక్తి తీసుకువెళ్తున్న రూ.1.30లక్షలు సీజ్ చేసినట్లు చిట్యాల ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని రామాపురం సరిహద్దు సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో రూ.లక్ష రూపాయల నగదు పట్టుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారును తనిఖీ చేయగా, రూ.లక్ష నగదు గుర్తించినట్లు తెలిపారు. నగదుకు సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసి ఎన్నికల అధికారికి అప్పగించినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలను విస్మరించి తరలిస్తున్న సుమారు రూ.3.40లక్షల నగదును నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి పట్టణంలో పట్టుకున్నట్లు ఎస్‌ఐ ఎన్.అంతిరెడ్డి తెలిపారు.

కోతుల దాడిలో దూడ మృతి

నూతనకల్, ఏప్రిల్ 10 : సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలో కోతులు దాడి చేయడంతో దూడ మృతి చెందింది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం మరికంటి పెంటమ్మకు చెందిన ఏడాది వయస్సు ఉన్న గేదెదూడ మేత కోసం బయటకువెళ్లింది. మేత తీసుకుని ఇంటికి వచ్చే సరికి కోతుల గుంపు దూడపై దాడి చేస్తున్నాయి. దీంతో చుట్టుప్రక్కల వారు వచ్చి కోతులను తరిమారు. కోతులు తీవ్రంగా దాడి చేయడంతో దూడ మృతి చెందింది. కోతుల బారి నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పెదవీడులో ఇరువర్గాల దాడులు

మఠంపల్లి, ఏప్రిల్ 10: ఇరువర్గాల దాడుల్లో పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం పెదవీడు గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి ఓ యువతి వ్యవహారంపై వాగ్వాదం ఇరువర్గాల మధ్య గొడవకు దారితీసింది. పెదవీడులోని ఎస్సీ కులానికి చెందిన యువతి, ముస్లిం యువకుడు మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోంది. ఇది నచ్చని ఎస్సీ కులస్థులు, ముస్లిం యువకులు గొడవపడుతున్నారు. సోమవారం అల్లు అర్జున్ జన్మదిన వేడుకల సందర్భంగా మరోసారి గొడవ జరిగింది. ముస్లిం యువకులు ఎస్సీ యువకులపై మంగళవారం దాడి చేయడంతో తొమ్మిది మందికి గాయాలయ్యాయి. దాడిని నిరసిస్తూ ఎస్సీ కులస్థులు ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనను విరమింపజేశారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

కబేళాకు తరలిస్తున్న గోవుల వాహనం సీజ్

మునగాల, ఏప్రిల్ 10: కబేళాకు గోవులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు బుధవారం సీజ్ చేశారు. సూర్యాపేట జిల్లా మునగాల ఎస్‌ఐ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ చంద్రాయణగుట్టకు చెందిన ఎండీ సాద్విత్, ఎస్‌కే షాదాబ్‌లు కోదాడ నుంచి ఓ వాహనంలో తొమ్మిది గోవులను తీసుకుని హైదరాబాద్‌లో కబేళాకు తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో మునగాల జాతీయ రహదారి వెంట వాహనాలు తనిఖీ చేస్తుండగా ఈ వాహనాన్ని ఆపి ప్రశ్నిస్తుండగా డ్రైవర్ సాద్విత్, షాదాబ్ వాహనం వదిలి పరారయ్యారు. వెంటనే పోలీసులు వెంబడించి వారిని పట్టుకుని వాహనం తనిఖీ చేయగా అందులో తొమ్మిది గోవులున్నాయి. ఆ గోవులను హైదరాబాద్ జియాగూడ గోశాలకు తరలించి, ఇద్దరిపై కేసు నమోదు చేసి వాహనం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనంతగిరిలో మహిళపై దాడి

అనంతగిరి, ఏప్రిల్ 10: సూర్యాపేట జిల్లా అనంతగిరి మండల కేంద్రంలోని ఓ వైన్‌షాప్‌లో పనిచేసే మహిళలపై కొంతమంది వ్యక్తులు దాడి చేసి గాయపర్చారు. ఈ విషయంపై ఇరువర్గాలు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. బుధవారం ఉదయం వైన్ షాప్‌లో మద్యం సేవించేందుకు వచ్చిన వ్యక్తులు ఘర్షణ పడుతుండగా, మహిళ వారించేందుకు ప్రయత్నించింది. ఆమెపై కూడా దాడి చేసి గాయపర్చారు. దీంతో తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మహిళ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా చెరువు మట్టి తరలింపు

కోదాడ రూరల్, ఏప్రిల్ 10: సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని యర్రవరం ఊరచెరువు మట్టిని కొంతమంది అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గ్రామంలో అనుమతులు లేకుండా చెరువు మట్టిని ప్రైవేటు వ్యక్తులు మూడు రోజులుగా విక్రయిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. యర్రవరం గ్రామ పరిసరాల్లో ఇటీవల కొందరు వెంచర్లు ఏర్పాటు చేశారు. ఈ వెంచర్లకు చెరువు మట్టిని తరలిస్తున్నారు. పొలాలకు మట్టి తోలుకుంటామని ఇరిగేషన్ అధికారుల వద్ద కొందరు అనుమతులు తీసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఈ విషయపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఎన్ఎస్పీ డీఈ స్వర్ణను వివరణ కోరగా, చెరువులో మట్టిని తోలుకుంటామని కొందరు రైతులు పట్టాదారు పుస్తకాలు తీసుకువచ్చి దరఖాస్తు చేసుకుంటే, అనుమతి ఇచ్చామన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు విక్రయించడానికి అనుమతులు ఇవ్వలేదన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో వెల్డింగ్ షాపు దగ్ధం

నూతన్‌కల్, ఏప్రిల్ 10: షార్ట్ సర్క్యూట్‌తో వెల్డింగ్ షాపు దగ్ధమైంది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిననెమిల క్రాస్‌రోడ్ వద్ద బుధవారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం దిర్శనపల్లి గ్రామానికి చెందిన గంట మధుసూదన్ క్రాస్‌రోడ్ వద్ద వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. ఉగాది పండుగ నేపథ్యంలో దుకాణాన్ని మూసివేశాడు. రాత్రి దుకాణంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి వెల్డింగ్ మిషన్, మోటార్లు కాలి బూడిదయ్యాయి. దీంతో లక్ష రూపాయలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి : ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బాలాజీనాయక్

అడవిదేవులపల్లి, ఏప్రిల్ 10: రానున్న వేసవికాలంలో మండలంలోని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య స మావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉన్నందు న వేసవికాలంలో అలాంటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు విద్య, వైద్యం విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకూడదన్నారు. గ్రామాల్లో కరెంట్ కోతలు ఎక్కువగా ఉన్నాయని, సంబంధిత విద్యుత్ అధికారులు ఎప్పటికప్పుడు సమస్యను పరిష్కరించాలన్నారు. అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వా రు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న స మస్యల పరిష్కారానికి తనవంతుగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నా రు. సమావేశంలో ఎంపీడీవో కరుణాకర్‌రావు, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఆర్ఐ శ్యామ్‌కుమార్, ఎంపీటీసీ కుర్ర కాంతికృష్ణ, డాక్టర్ ఉపేందర్, విద్యుత్ ఏఈ శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపదను సృష్టించే కార్మికులపై నిర్లక్ష్యం


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న నారి అయిలయ్య

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 10: ప్రజలందరికీ ఆహార ఉత్పత్తిని చేస్తూ దేశ సంపదను సృష్టిస్తున్న వ్యవసాయ కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) రాష్ట్ర కార్యదర్శి నారి అయిలయ్య విమర్శించారు. మండలంలోని గోపలాయపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులను కుదిస్తూ పథకాన్ని క్రమంగా నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. వంద రోజుల పనిదినాలను 200 రోజులకు పెంచి కూలీ రూ.800లు గిట్టుబాటయ్యేలా చట్టాన్ని సవరించాలని అయిలయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యకాస నాయకులు బెల్లి లింగయ్య, వడ్లకొండ కావ్య, సాయిని శ్యామల, భద్రబోయిన పద్మ, పల్లెబోయిన మల్లేశ్, వెంకన్న, మం జుల, పద్మ, అరుణ, స్వామి అలివేలు తదితరులు పాల్గొన్నారు.

పూలే అడుగుజాడల్లో పయనించాలి



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేఎస్ఎం కళాశాల అధ్యాపకులు

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 10: విద్యార్థులు పూలే అడుగుజాడల్లో పయనించాలని కేఎస్ఎం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి క్షమయ్య అన్నారు. మహాత్మాజ్యోతీరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్ణాధిక్యతను నిరసిస్తూ అణగారిన వర్గాల అభివృద్ధి కోసం పనిచేసిన మహనీయుడు పూలే అన్నారు. నేటి యువత ఆయన అడుగుజాడల్లో పయనించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగ్ కోటయ్య, రాంరెడ్డి, ఆర్. శ్రీను, నరేందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

చెరువును పరిశీలించిన జిల్లా మత్స్యశాఖ అధికారి

కేతేపల్లి, ఏప్రిల్ 10: అనుమానాస్పద స్థితిలో భారీగా చేపలు మృతి చెందిన కేతేపల్లి మండలంలోని బొప్పారం గ్రామ ఊర చెరువును బుధవారం మత్స్య శాఖ జిల్లా అధికారి వెంకయ్య సందర్శించారు. చెరువు నీటిలో గుంపులు గుంపులుగా తేలియాడుతున్న చేపలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మత్స్యకారులతో మాట్లాడారు. చేపలు ఎన్ని రోజులుగా ఇలా మృతి చెందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. చెరువులో చేపల మృతికి విషప్రయోగం జరిగి ఉండకపోవచ్చని, మూసీ ప్రాజెక్టు అడుగంటి విషతుల్యంగా మారిన నీరు ఇటీవల చెరువులో చేరడంతో నీటిలో ప్రాణవాయువు స్థాయి ప్రమాదకర స్థితికి చేరడం, వేసవి ఎండలు విపరీతంగా ఉండటం చేపల మృతికి కారణమై ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. వీలైన త్వరగా చెరువులో చేపలు పట్టుకోవాలని ఆయన మత్స్యకారులకు సూచించారు. చేపల మృతితో జీవనోపాధి దెబ్బతిన్న తమను శాఖాపరంగా ఆదుకోవాలని మత్స్యకార సొసైటీ సభ్యులు ఆయనకు విన్నవించారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన వారికి చెప్పారు. ఇదిలా ఉంటే మత్స్యకారులు చెరువులో చేపల మృతిని అరికట్టే చర్యలు చేపట్టారు. చేపలకు ఏమైనా వ్యాధులు ఉంటే అరికట్టేందుకు దోహదపడే సున్నం పొడిని చెరువులో నాటు పడవలపై తిరిగి చల్లారు.

'విజయయాత్రను విజయవంతం చేయాలి'

నల్లగొండ, ఏప్రిల్ 10: నల్లగొండ పట్టణంలో ఈ నెల 23వ తేదీన నిర్వహించే వీరహనుమాన్ విజయయాత్రను విజయవంతం చేయాలని భజరంగ్‌దళ్ తెలంగాణ ప్రాంత కోకన్వీనర్ కన్నెబోయిన వెంకట్ పిలుపునిచ్చారు. ఈ యాత్ర పట్టణంలోని పాతబస్తీలో గల అభయాంజనేయస్వామి దేవాలయం నుంచి ప్రారంభమై వీటీకాలనీ పంచముఖ హనుమాన్ దేవాలయం వరకు కొనసాగునని తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రం, బైక్ స్టిక్కర్లను గురువారం పట్టణంలోని తులసీనగర్ హనుమాన్ దేవాలయంలో ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. హిందూ బంధువులందరూ పాల్గొనాలని కోరారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

త్రిపురారం ఏప్రిల్ 10: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. ఈ మండలకేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. సింగం కనకమ్మ పాడి గేదె బుధవారం ఉదయం వరి పొలంలో మేత మేస్తూ విద్యుత్ స్తంభం నుంచి వ్యవసాయ మోటార్‌కు విద్యుత్ సరఫరా అయ్యే సర్వీస్ వైర్ తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె యజమాని సమాచారంతో మండల పశువైద్యాధికారి శశికళ సంఘటన స్థలానికి వెళ్లి పరీక్షించారు. గేదె విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని బాధితురాలు వాపోయింది.

దగాపడుతున్న దొండ రైతులు

- దళారుల చేతిలో మోసపోతున్న అన్నదాతలు
- నిరుపయోగంగా పీఏపల్లి మండలంలో దొండ మార్కెట్
- కలెక్టర్ ఆదేశించినా ముందుకు సాగని వైనం
- గిట్టుబాటు ధర కల్పించాలని వేడుకోలు




పీఏపల్లి మండలంలో రైతులు సాగు చేసిన దొండ పంట. దొండ మార్కెట్

దేవరకొండ, ఏప్రిల్ 10: నల్లగొండ జిల్లా పీఏపల్లి, గుర్రంపోడు మండలాలలో 15 వేల ఎకరాలకుపైగా దొండ, మునగ పంటలను రైతులు సాగు చేశారు. ఏఎమ్మార్పీ ఆయకట్టు కింద నీటిని విడుదల చేయకపోవడంతో వరి సాగుపై ఆశలు వదులుకున్న రైతులు ఆరుతడి పంటలైన దొండ, మునగ, ఇతర కూరగాయల సాగుపై దృష్టి సారించారు. పీఏపల్లి మండలం కోనమేకలవారిగూడెం, అక్కంపల్లి, రంగారెడ్డిగూడెం, మల్లాపురం, అంగడిపేట గ్రామాల్లో రైతులు 8 నుంచి 9వేల ఎకరాలకు పైగా దొండ పంటలను సాగు చేశారు. కాని దొండ రైతులకు మార్కెట్ సౌకర్యంలేకపోవడంతో దళారుల చేతిలో మోసపోతున్నారు. పీఏపల్లి మండలం కోనమేకలవారిగూడెం వద్ద అప్పటి ప్రభుత్వం 2016లో దొండ మార్కెట్‌ను రూ.60లక్షలతో ఏర్పాటు చేసింది. కానీ మార్కెట్ సౌకర్యం కల్పించకపోవడం, అధికారుల నిర్లక్ష్యంతో దొండ మార్కెట్ నిరుపయోగంగా మారింది. ఇటీవల రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో స్పందించిన కలెక్టర్ జిల్లా వ్యవసాయ అధికారికి దొండ మార్కెట్‌ను పునరుద్ధరించి మార్కెటింగ్ సౌకర్యం కల్పించి దొండ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో వారం రోజుల క్రితం జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్‌కుమార్‌తో పాటు వ్యవసాయశాఖ అధికారులు కోనమేకలవారిగూడెం దొండ మార్కెట్‌ను సందర్శించారు. రైతులు, మార్కెట్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మార్కెట్‌లోనే కొనుగోలు చేయాలని గిట్టుబాటు ధర కల్పిస్తామని నిర్ణయించారు. కాగా ఇప్పటివరకు మార్కెట్, వ్యవసాయశాఖ అధికారులు స్పందించకపోవడంతో దొండ రైతులు తాము పండించిన పంటలను వ్యాపారులకే అప్పగించి వారు నిర్ణయించినధరకే విక్రయించి నష్టపోతున్నారు.

ఖర్చు లక్షల్లో.. ఆదాయం వందల్లో..

ఎకరాకు దొండసాగు రూ.2.5 లక్షలు ఖర్చు అవుతుంది. ఉద్యానవన శాఖ రూ.60వేలు సబ్సిడీ ఇస్తుంది. 60 రోజుల నుంచి దొండ పంట దిగుబడి వస్తుంది. ప్రస్తు తం దొండకాయలు 50 కేజీల బస్తాకు మార్కెట్‌లో రూ.300 నుంచి 500 వరకు ధర పలుకుతుంది. హైదరాబాద్, మహబూబ్‌నగర్, బోయినపల్లి, వరంగల్, గుంటూరు, మాచర్ల నుంచి రైతులు వాహనాల్లో దొం డ తోటల వద్దకు వచ్చి వారు నిర్ణయించిన ధరకే రైతులనుంచి దొండ కాయలను విక్రయిస్తున్నారు. దీంతో రైతులు మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో విధిలేని పరిస్థితిలో దళారులు చెప్పిన రేటుకే దొండ పంటలను విక్రయించే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం మార్కెట్‌లో ఉన్న ధరకు దొండ పంటలను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని దొండ రైతులు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



దొండ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి. మార్కెట్ సౌకర్యం ఏర్పాటు చేసి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. 5 ఎకరాలలో దొండ పంటలను సాగు చేశాను. ఎకరాకు 2లక్షలకు పైగా పెట్టుబడులు పెట్టాను.మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో దళారులు చెప్పిన ధరకే విక్రయిస్తున్నాం.

-మద్దిమడుగు పవన్‌కుమార్, అక్కంపల్లి, పీఏపల్లి మండలం, దొండ రైతు.

దొండ మార్కెట్ ఏర్పాటు చేయాలి



పీఏపల్లి మండలంలోని దొండ రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి. దొండ రైతులు మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో దళారుల చేతిలో మోసపోతున్నారు. లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టి గిట్టుబాటు ధర రాకపోవడంతో విధిలేని పరిస్థితిలో విక్రయిస్తున్నారు. రైతులు సాగు చేసిన దొండ పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలి.

- నర్సింహారెడ్డి, సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు

మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు సన్నాహాలు

కలెక్టర్,ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పీఏపల్లి మండలం కొనమేకలవారిగూడెంలో దొండ మార్కెట్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేపడుతున్నాం. వ్యవసాయ,మార్కెటింగ్‌శాఖ అధికారులు, రైతులతో సమావేశం నిర్వహించాం. త్వరలో మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

- శ్రీలక్ష్మి, ఏడీఏ, దేవరకొండ

దేశ సమగ్ర అభివృద్ధే నరేంద్రమోదీ లక్ష్యం

● బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి సైదిరెడ్డి



సమావేశంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న సైదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వర్షిత్‌రెడ్డి

నల్లగొండ, ఏప్రిల్ 10: దేశ సమగ్ర అభివృద్ధే ప్రధాని మోదీ లక్ష్యమని, నేడు ప్రపంచ దేశాలన్నీ మోదీ వైపే చూస్తున్నాయని బీజేపీ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలో పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో 400 స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని, అందులో నల్లగొండ కూడా ఉంటుందన్నారు. దేశహితం కోసం ప్రతీ ఒక్కరూ బీజేపీకే ఓటు వేయాలని కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రితో సహా మంత్రులందరూ తమ కుర్చీ కాపాడుకోవడం కోసమే పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజా సంక్షేమం పూర్తిగా విస్మరించి క్రీడలను తిలకిస్తూ ఎంజాయ్ చేస్తున్నారని విమర్శించారు. జిల్లాలో వారసత్వ రాజకీయాలను బొంద పెడతామన్నారు. గతంలో నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నల్లగొండను ఎంత అభివృద్ధి చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు అందుతాయన్నారు. నల్లగొండలో తనను గెలిపిస్తే మూడేళ్లలో పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరే వరకు పోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రతీ సంక్షేమ పథకం వెనుక కేంద్ర ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ 100అబద్ధాల హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ మరోసారి మోసం చేసేందుకు వస్తుందని దీనిని ప్రజలు తిప్పి కొట్టాలని అన్నారు. జిల్లాలో కుటుంబ రాజకీయాలకు స్వస్తి చెప్పాలని పిలుపునిచ్చారు. నాయకుడు పిల్లి రామరాజు యాదవ్ మాట్లాడుతూ బీజేపీలో చేరడం తన పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. దేశం బాగుండాలంటే అవినీతి లేకుండా పాలన జరగాలంటే మోదీ మరోసారి ప్రధాని కావాల్సిందేనని అన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, నాయకులు దాయం భూపాల్‌రెడ్డి, పోతేపాక సాంబయ్య, విద్యాసాగర్, దాసరి సాయి, గడ్డం మహేష్, రావెళ్ల కాశమ్మ, పెరిక మునికుమార్, లోకనబోయిన రమణ, తదితరులు ఉన్నారు.

సైదిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

దేవరకొండ: నల్లగొండ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లేష్‌నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి సురేష్ అన్నారు. దేవరకొండ టీటీడీ కల్యాణ మండపం లో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం దేశ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి సైదిరెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో నియోజకవర్గ బీజేపీ గిరిజనమోర్చా కన్వీనర్ వడ్త్య బిక్షపతి, పట్టణ అధ్యక్షుడు గుండాల అంజయ్య యాదవ్, వినోద్ రాథోడ్, సంతోష్‌నాయక్, కొర్ర రాజు నాయక్, అంజినాయక్, శంకర్‌నాయక్, జయరాం, నందు, లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

రంజాన్‌ను ఘనంగా నిర్వహించుకోవాలి


ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వేములపల్లి, ఏప్రిల్ 10: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఉస్మాన్ మసీదులో ముస్లింలకు బుధవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల్లో ప్రతీరోజు నన్ను కూడా భాగస్వామ్యం చేయడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆటా మహాసభలకు రాపోలుకు ఆహ్వానం


రాపోలు భాస్కర్

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 10: అమెరికా దేశంలోని జార్జియానగరంలో అమెరికా తెలుగు అసోసియేషన్ (ఆటా) 18వ మహాసభలు జూన్ నెలలో జరగనున్నాయి. ఈ మహాసభలకు హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్‌కు ఆహ్వానిస్తూ ఆటా అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్‌రెడ్డి, పాశం, మధు బొమ్మినేని బుధవారం లేఖ పంపినట్లు ఆయన తెలిపారు. ప్రజావాజ్యం కేసులను వాదించడంతో పాటు, సామాజిక కార్యక్రమాలు, పెండింగ్ కేసుల రాజీకుదర్చడంలో తాను చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఆటా ఆహ్వానం లభించిందన్నారు. అగ్రరాజ్యంలో జరిగే ఆటా మహాసభలకు రాపోలు భాస్కర్‌ను ఆహ్వానం లభించడంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డుకు పక్కన ఇసుకతో ప్రమాదాలు


నకిరేకల్ - గురజాల డబుల్‌రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన ఇసుక

శాలిగౌరారం, ఏప్రిల్ 10: శాలిగౌరారంలోని నకిరేకల్ - గురజాల ప్రధాన రహదారిలో గ్రోమోర్ ఎరువుల దుకాణం నుంచి శాలిగౌరారం బస్టాప్ వరకు ఉన్న కిలోమీటర్ ఆర్అండ్‌బీ డబుల్ రోడ్డుకు ఇరువైపులా ఇసుక పేరుకుపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. భారీ వాహనాలు ఎదురుగా వచ్చినప్పుడు తప్పించే క్రమంలో ద్విచక్ర వాహన చోదకులు పేరుకుపోయిన ఇసుక మీద నుంచి వెళ్లడంతో జారికింద పడిపోతున్నారు. ఎంతో మందికి తీవ్రగాయాలైన సంఘటనలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన చెందుతన్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన ఇసుకను, కంప చెట్లను వెంటనే తొలగించి ప్రమాదాల బారి నుంచి రక్షించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ప్రయాణికుల దాహార్తిని తీర్చాలి : ఆర్టీసీ డీఎం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎం పాల్

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 10: ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు చర్యలు చేపట్టడం హర్షనీయమని ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్ అన్నారు. వాసవీ క్లబ్ గ్రేటర్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని క్లబ్ గవర్నర్ రాచెర్ల కమలాకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాల్ మాట్లాడుతూ క్లబ్ సభ్యులు శుభకార్యాలు, ఉత్సవాల సందర్భంగా ఆర్టీసీ ప్రయాణికుల మధ్య నిర్వహించుకోవడం గొప్ప విషయమన్నారు. ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో రాయపుడి భవాని, తిరునగరు పద్మ, కలకోట లక్ష్మయ్య, తెడ్ల జవహర్, రేపాల శ్రీనివాస్, జనార్ధన్, శత్రయ్య, వెంకటేశ్వర్లు, మల్లయ్య, వీటి తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి చిరుతలు, అటవీ జంతువులు

● సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు

● అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు


తెల్‌దేవరపల్లిలో చిరుత ఆనవాళ్లను సేకరిస్తున్న అటవీశాఖ అధికారులు

దేవరకొండ/చందంపేట, ఏప్రిల్ 10: ఎండలు మండుతుండటంతో నల్లమల్లలో చిరుతలతో పాటు అటవీ జంతువులు, వన్యప్రాణులు జనవాసాలలోకి వస్తుండటంతో పరిసర గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ నెల 6వ తేదీన చందంపేట మండలం తెల్‌దేవరపల్లి గ్రామ శివారులో చిరుత సంచరించి రెండు ఊర కుక్కలు, అడవి పందులను చంపివేసినట్లు ఆనవాళ్లు కనిపించాయని గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అప్రమత్తమైన దేవరకొండ రేంజ్ అటవీశాఖ అధికారి సాయి ప్రకాష్ ఆధ్వర్యంలో అటవీ శాఖ సిబ్బంది తెల్‌దేవరపల్లి పరిసర ప్రాంతాల్లో ఆదివారం 5 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. గ్రామస్థులు భాయాందోళన చెందవద్దని చిరుతగాని, అటవీ జంతువులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని అటవీ శాఖ అధికారులు కోరుతున్నారు. ఇప్పటికే చిరుతలతో పాటు అటవీ జంతువులు, వన్యప్రాణుల సంరక్షణకు నల్లమల్లలో నీటి తొట్లు ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

డిండి, ఏప్రిల్ 10: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం మైనార్టీలకు బీఆర్ఎస్ నాయకుడు వడ్త్య రమేష్‌నాయక్ బుధవారం రంజాన్ తోఫా అందజేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ముస్లింలు కూడా సంతోషంగా రంజాన్ పండుగను నిర్వహించుకోవాలని సూచించారు. 21 కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గిరమోని శ్రీనివాస్, బలుముల తిరుపతయ్య, గుర్రం సురేష్, ఎండి. రషీద్, పున్నం లింగమయ్య, జూలూరి వెంకటేష్, పీర్‌మహమ్మద్, మునగపాటి శ్రీనివాస్, వినోద్, నజీర్, శౌకత్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని ప్రచారం

కట్టంగూరు: భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ బుధవారం బీజేపీ నాయకులు మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అయిటిపాముల గ్రామంలో బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్ ఇంటింటి తిరిగి ప్రచారం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు పబ్బు వెంకన్న గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ కూలీల దగ్గరకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గోలి మహేశ్వరి, నాగరాజు, సతీష్ పాల్గొన్నారు.

స్వీపర్ కుటుంబానికి పోలీస్ సిబ్బంది చేయూత

నిడమనూరు, ఏప్రిల్ 10: నిడమనూరు పోలీస్‌స్టేషన్‌లో ప్రైవేటు స్వీపర్‌గా పని చేస్తూ ఆదివారం రాత్రి మృతి చెందిన వెంపటి మట్టమ్మ కుటుంబానికి నిడమనూరు ఎస్ఐ రూ.30వేలు అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. మట్టయ్య స్టేషన్‌లో 30 సంవత్సరాలుగా స్వీపర్‌గా పని చేస్తున్నారు. బుధవారం మట్టమ్మ చిత్రపటానికి నిడమనూరు ఎస్ఐ గోపాల్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వారి వెంట ఏఎస్ఐ జ్యోతి, కానిస్టేబుల్ విజయ్, శేఖర్, నరేందర్, హనుమంతరావు తదితరులు ఉన్నారు.

కాపుగంటి సోమన్నకు ఘనంగా నివాళులు

కట్టంగూరు, ఏప్రిల్ 10: కట్టంగూరు మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కాపుగంటి సోమన్న గ్రామానికి పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. సోమన్న వర్ధంతి సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కట్టంగూరు ఎంపీటీసీ మాద యాదగిరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డిపల్లి సాగర్, మిట్టపల్లి శివశంకర్, నిమ్మల సత్యనారాయణ, గుండు పరమేష్, గుండు శేఖర్, బుచ్చాల వెంకన్న, కాపుగంటి గోపు, కాపుగంటి శ్రీను, కొంపెల్లి యాదయ్య, కానుగు లింగయ్య, గట్టిగొర్ల సత్తయ్య, మర్రి రాజు, కొంపల్లి లక్ష్మయ్య, రెడ్డిపల్లి వీరస్వామి, సైదులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 10: అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు యేకుల సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి ప్రమోద్

నల్లగొండరూరల్, ఏప్రిల్ 10: బీజేపీ నల్లగొండ మండల ప్రధాన కార్యదర్శిగా మండలంలోని ఖుదావన్‌పూర్ గ్రామానికి చెందిన కొత్తపల్లి ప్రమోద్‌ని నియమిస్తూ పార్టీ మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్ నియామకపత్రాన్ని అందించారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కనగల్: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా కనగల్ గ్రామానికి చెందిన బైరగోని అశోక్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి బుధవారం నల్లగొండలో నిర్వహించిన సమావేశంలో అశోక్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

రాజుపేట తండాలో చలివేంద్రం ఏర్పాటు

మర్రిగూడ, ఏప్రిల్ 10: వేసవికాలం ప్రారంభమైనందున బాటసారుల దాహం తీర్చేందుకు మహాలక్ష్మి సంస్థ చైర్మన్ కొడాల వెంకట్‌రెడ్డి బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. రాజుపేట తండా పరిధిలోని ఎక్స్‌రోడ్డు చలివేంద్రం ప్రారంభించడంపై ప్రజలు, బాటసారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి చలివేంద్రాలను మరిన్ని ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

కనగల్, ఏప్రిల్ 10: మండలకేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థులకు న్యూకంబాల శివలీల ఫౌండేషన్ అధ్యక్షురాలు కంబాల శివలీల, జలసాధన సమితి నాయకుడు బండమీది అంజయ్యపరమేశ్వరి దంపతులు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అందుకోవాలని సూచించారు.

కోతుల మృతిపై విచారణ చేపట్టాలి

నల్లగొండ, ఏప్రిల్ 10: నాగార్జునసాగర్‌లోని మంచినీటి ట్యాంకులో కోతులు పడి మృతి చెందని సంఘటనపై విచారణ చేపట్టాలని పౌరమానవుల హక్కులు, ప్రజావేగు పారలీగర్ వలంటీర్ కన్నెకంటి క్రాంతికుమార్, పశుపోషణ శాఖ జాయింట్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆ ట్యాంకు వాటర్ తాగిన వారికి వైద్య పరీక్షలు చేయాలని, మృతి చెందిన కోతులకు పోస్టుమార్టం చేయాలని ఆయన కోరారు. బాధ్యతారహితంగా వ్యవహరించిన అధికారులపై తగు చర్యలు చేపట్టాలని కోరారు.

ఏటీఎం ఏర్పాటు చేయాలని వినతి

కేతేపల్లి, ఏప్రిల్ 10: మండలకేంద్రం కేతేపల్లితో ఏటీఎం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ పనుల నిమిత్తం మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు కేతేపల్లికి నిత్యం వస్తుంటారు. మండల కేంద్రంలో ఏటీఎం సేవలు అందుబాటులో లేకపోవడంతో అయా కార్యాలయాల్లో పనులు చూసుకుని తమ అవసరాలకు డబ్బు డ్రా చేయడానికి ప్రత్యేకంగా నకిరేకల్, సూర్యాపేట పట్టణాలకు వెళ్లాల్సి వస్తుంది. ఇప్పటికైనా బ్యాంకు యాజమాన్యాలు స్పందించి మండల కేంద్రం కేతేపల్లిలో ఏటీఎం సేవలను అందుబాటులోకి తేవాలని మండల ప్రజలు కోరుతున్నారు.